దిగొస్తున్న చికెన్ ధరలు



హిందూపురంలో ఓ దుకాణం ముందు అమ్మకానికి ఉంచిన చికెన్


- 'పురం'లో కేజీ చికెన్ ధర రూ.155
- స్కిన్‌లెస్ చికెన్ రూ.175
- శ్రావణ మాస ఎఫెక్టే అంటున్న వ్యాపారులు

హిందూపురం అర్బన్ శ్రావణ మాసం ప్రారంభమైంది. హిందువులు ఈ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. దీంతో ఎక్కువ మంది ఆలయాలకు వెళ్లడంతో పాటు ఇళ్లలోనూ ప్రత్యేక పూజలు చేస్తుంటారు. దీనికి తోడు నాగుల చవితి సందర్భంగా ఎక్కువ మంది పుట్టకు పాలు పోస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రావణ మాసం ఎఫెక్ట్ చికెన్ ధరలపై పడింది. ఈ మాసంలో ఎక్కువ మంది నాన్‌వెజ్ ముట్టుకోరు. అధిక శాతం మంది ప్రత్యేక పూజలు, ఉపావాసాలు చేస్తూ ఉంటారు. అందుకే చాలా ఇళ్లలో ముక్క ముట్టరు. చికెన్ ధరలు తగ్గ డానికి ఇది ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఫౌల్ట్రీల్లో ఎదుగుతున్న కోళ్లను.. నిర్దీత సమయం దాటిన తర్వాత అక్కడ ఉంచరు. అలా ఉంచితే దాణా నష్టం తప్ప, బిజినెస్ పరంగా ఎలాంటి లాభమూ ఉండదని చెబుతున్నారు. అందుకే.. జనం పెద్దగా మాంసాన్ని కొనుగోలు చేపట్టకపోయినా కూడా.. కోళ్లను చికెన్ షాపులకు తరలిస్తున్నారు. ఈ ఫలితంగానే ధరలు తగ్గాయంటున్నారు. శ్రావణమాసం మొదట్లోనే ధర ఇలా ఉంటే.. రాబోయే రోజుల్లో చికెన్ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందంటున్నారు.

మార్కెట్‌లో చికెన్ ధరలు ఇలా...

చాలా రోజులపాటు కేజీ చికెన్ ధర రూ.250 నుంచి 200 మార్కు నుంచి తగ్గలేదు. కానీ.. గడిచిన పది రోజులుగా చికెన్ ధరలు కిందకు దిగివస్తున్నాయి. గురువారం హిందూపురం మార్కెట్లో విత్ స్కిన్ చికెన్ కిలో రూ.1 55, స్కిన్ లెస్ రూ.175కు అమ్ముతున్నారు.

కోడిగుడ్ల ధరలు కూడా...



కోడిగుడ్ల ధరలు సైతం శ్రావణమాసం ఎఫెక్ట్‌తో కాస్తంత తగ్గు ముఖం పట్టాయి. మార్కెట్‌లో 10 రోజుల క్రితం హోల్‌సేల్‌లో 100 కోడిగుడ్ల రూ.630 పలికాయి. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో 100 గుడ్ల ధర రూ.550 ఉన్నట్లు కోడిగుడ్ల హోల్‌సేల్ వ్యాపారి నయముల్లా తెలిపారు.

వ్యాపారం తగ్గింది



శ్రావణమాసం కారణంగా మార్కెట్‌లో చికెన్ అమ్మకాలు కాస్త తగ్గాయి. మార్కెట్‌లో కిలో విత్ స్కిన్ రూ. 155 పలుకుతుండగా విత్ అవుట్ స్కిన్ రూ.175 వరకూ అమ్మకం చేస్తున్నాం. రానున్న రోజుల్లో మరింతగా చికెన్ ధరలు తగ్గినా ఆశ్చర్యపోనవరం లేదు. శ్రావణం మొత్తం ఇలా ఉంటుందని అనుకుంటున్నాను.

- నవాబ్‌వలి, చికెన్ వ్యాపారి, చిలమత్తూరు

క్లుప్తంగా

ఆర్థిక విషయాలపై అవగాహన అవసరం



కామర్స్‌డేలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

పెనుకొండ: పట్టణంలోని సత్యసాయి కళాశాలలో ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కామర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, యాడ్ మేకింగ్, సెమినార్ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు తరాలకు సంపద సృష్టించే విధంగా తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఆర్థిక విషయాలపై అవగాహన ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అశోక్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



ఉద్యోగులతో సభ్యత్వ నమోదు చేసుకుంటున్న దృశ్యం

అగళి: ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గోవిందప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు తెలుసుకొని, పరిష్కార మార్గాలపై చర్చించారు. అనంతరం ఉద్యోగులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గ అధ్యక్షుడు భూతేగౌడ్, ఉపాధ్యక్షుడు త్యాగరాజు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు వి.భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన అమరాపురంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులతో ఆయన పలు విషయాల పై చర్చించారు. అనంతరం ఏపీజీఈఏ సభ్యత్వాన్ని ఉద్యోగులు తీసుకున్నారు.

సెంట్రల్ జోన్ పోటీలకు ఎంపిక



మౌనికకు ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని నారనాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మౌనిక ఆర్డీటీ అథ్లెటిక్స్ సెంట్రల్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రామాంజినేయులు, పీఈటీ మహేష్ తెలిపారు. శుక్రవారం పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఆర్డీటీ అథ్లెటిక్స్ మీట్ అండర్-14 బాలికల విభాగంలో మౌనిక ప్రథమ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 2వ తేదీన అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో జరిగే సెంట్రల్ జోన్ సెలక్షన్స్‌లో మౌనిక పాల్గొనున్నట్లు చెప్పారు.

'పురం' ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా వెంకటేష్



హిందూపురం టౌన్: మండల ఇన్‌చార్జ్ (ఎఫ్ఏసీ) తహసీల్దార్‌గా వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడ ఇన్‌చార్జ్‌లే బాధ్యతలు నిర్వహిస్తుండగా, రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

హీరో మహేష్‌బాబు జన్మదినం



విద్యార్థులకు పుస్తకాలు అందించిన దృశ్యం

పరిగి: సినీ నటుడు, సూపర్‌స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలోని గొరవనహళ్లిలో ఘనంగా నిర్వహించారు. మహేష్‌బాబు, సూపర్‌స్టార్ కృష్ణ అభిమాన సంఘం నాయకుల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిల్‌లను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గీతాలక్ష్మీ, ఉపాధ్యాయులు మల్లికార్జున, రాజు, సర్పంచ్ అరుణ, మాజీ ఎంపీటీసీ అంజి, సంజీవరాయప్ప (ప్రభు), తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నిరసన

మడకశిర: విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పేర్లను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త ఈరలక్కప్ప పాల్గొంటారని , పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాలుగు ప్రాథమిక పాఠశాలల మూత?

మడకశిర: మండలంలో నాలుగు ప్రాథమిక పాఠశాలలు మూతపడుతున్నట్లు తెలిసింది. కోనప్పపాళ్యం, దిగువగొల్లహట్టి, ముద్దారెడ్డిపాళ్యం, బచ్చలయ్యపాళ్యం ప్రాథమిక పాఠశాలలు మూతపడుతున్నట్లు సమాచారం. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో పాఠశాలల మూతకు కారణమని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

రైతుల సమస్యలు పరిష్కరించండి

పరిగి: దేశంలో రైతాంగాన్ని కాపాడే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. రైతులకు, పాడి పరిశ్రమకు చేయూతనిచ్చి ఆయా రంగాలలో వారిని అండగా నిలవాలని అఖిల భారత రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆశాఖ రాష్ట్ర అధ్యక్షుడు గిరీష్, రంగనాయకులు , రాష్ట్ర రైతు సంఘం నాయకుడు ధనాపురం వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తైలాభిషేక పండుగ



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ సుధాకర్



పాల్గొన్న క్రైస్తవులు

పెనుకొండ: పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో శుక్రవారం తైలాభిషేక పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్ సుధాకర్ భక్తులకు అభిషేక తైలం తలమీద పోసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తైలాభిషేక పర్వదినం ప్రాధాన్యతను వివరించారు. ప్రత్యేక ప్రార్థనలకు పెద్ద ఎత్తున క్రైస్తవులు తరలివచ్చారు. ప్రార్థనల తర్వాత భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సమాజంలో అందరూ సమానమే

పరిగి: సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేనని, భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి అసమానతలను తొలగించడానికి పాటు పడాలని అధికారులు తెలిపారు. ఆదివాసీల దినోత్సవాన్ని మండలంలోని చిన్నపల్లిలో అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దారు హసీనా సుల్తానా, స్పెషలాఫీసర్ ప్రసాదరావు , సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంఈఓ లక్ష్మీదేవి, ఎంపీడీఓ సుహాసినమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలోని మందలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎమ్ఎస్ తండాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ఉండే గిరిజనులు కూడా అభివృద్ధి చెందినప్పుడే సమాగ్రాభివృద్ధి సాధించినట్లన్నారు. నీటి సమస్య ఉందని స్థానికులు చెప్పగా.. ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎంపీడీఓ బంగారమ్మ, ఈఓఆర్‌డీ నాగరాజు నాయక్, సర్పంచ్ అశ్వత్ తదితరులు పాల్గొన్నారు.



గుడిబండ: మాట్లాడుతున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామచంద్ర

రొళ్ల: ప్రజలందరు కలసి కట్టుగా ఉండి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, పెనుకొండ డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి పేర్కొన్నారు. జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెనుకొండ డీఎల్‌పీఓ శివనారాయణ రెడ్డి శుక్రవారం రొళ్లగొల్లహట్టితండా సందర్శించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల గెలుపు



చైర్మన్, వైస్ చైర్మన్ శివ, అనిల్

రొద్దం: మండల పరిధిలోని పెద్దిపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గెలుపొందారు. చైర్మన్‌గా ఈడిగ శివ, వైస్ చైర్మన్ హెచ్ అనీల్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ సభ్యులను పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు.

దుండగులను అరెస్ట్ చేయాలి

రొళ్ల: విజయవాడలోని స్మృతివనంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంలోని పేర్లను ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కక్షతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఒక ప్రకటనలో విమర్శించారు. టీడీపీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి, గౌరవం ఉన్నా కూడా వెంటనే అంబేడ్కర్ విగ్రహం వద్ద యథావిధిగా పేర్లతో కూడిన శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



రొద్దం: పుట్ట వద్ద పూజల్లో పాల్గొన్న మహిళలు

రొద్దం/అమరాపురం: నాగుల పంచమిని పురస్కరించుకొని రొద్దం,అమరాపురం మండలాల్లో నాగుల ప్రతిమలు, పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో పాలు వేసి నాగుల పంచమిని జరుపుకున్నారు.

'పురం' సమగ్రాభివృద్ధికి కృషి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం టౌన్: పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే పాలకులు, అధికారులు సైతం సమన్వయంతో పని చేస్తేనే సాధ్యమవుతుందన్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన మురుగును శుభ్రం చేయడానికి రూ.1.13 కోట్లు నిధులు మంజూరుకాగా, టెండర్ల ప్రక్రియ పూర్తయిందని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇక ప్లానింగ్ సెక్రటరీలు వారి పరిధిలో ఉన్న అక్రమ కట్టడాలను గుర్తించి వాటిని సక్రమం చేయాలన్నారు. మురుగు కాలువలపై చేసిన నిర్మాణాలను తొలగించాలన్నారు. ఆదాయాన్ని పెంచేందుకు 12వ తేదీ నుంచి 19 వరకూ ఇంటి పన్నుల క్రమబద్ధీకరణ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

భూమి తిరిగిచ్చేయాలని నిరసన

మడకశిర: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు పేరుతో ప్రభుత్వాలు దాదాపు 2,200 ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకున్నాయని, అయితే ఇంతవరకూ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. తిరిగి ఆ భూములను రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులుకి వినతి పత్రం సమర్పించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాల పెద్దన్న , వెంకటరెడ్డి, కేవీపీఎస్ నాయకులు రామాంజనేయులు, యోగానంద్, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న రైతులు

న్యాయం చేయాలని చిరువ్యాపారుల వినతి

మడకశిర: తమకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ ఇన్‌చార్జ్ పవిత్ర ఆధ్వర్యంలో శుక్రవారం చిరు వ్యాపారులు పోలీసులకు వినతిపత్రం అందజేశారు. మార్కెట్లో కొందరు దళారులు మండీలు ఏర్పాటు చేసుకుని పూలు, కూరగాయాల చిరు వ్యాపారులైన తమ పొట్ట కొడుతున్నారన్నారు. దళారులను నివారించి తమకు న్యాయం చేయాలని కోరారు.

వర్షం కోసం పూజలు



వర్షం కోసం రామదండు వెళుతున్న పెద్దిపల్లి రైతులు

రొద్దం: పంటలు సాగు చేసి నెలలు గడుస్తున్న వర్షాలు పడకపోవడంతో శ్రీరామా... వర్షం కురిపించి పంటలను రక్షించు అంటూ రైతులు వేడుకుంటున్నారు. మండల పరిధిలోని పెద్దిపల్లికి చెందిన రైతులు శుక్రవారం వర్షం కోసం రామదండు వెళ్లారు. శ్రీరామ భక్తి గీతాలు ఆలపిస్తూ కాలి నడకన మూడు గ్రామాలు తిరిగితే వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో శ్రీమదండు వెళ్లినట్లు రైతులు తెలిపారు. తురకలాపట్నం, ఎల్‌జీబీనగర్, సానిపల్లి గ్రామాలకు రామదండు వెళ్లారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొందిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శనివారం నుంచి 12వ తేదీ వరకూ వివిధ విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వీర శైవలింగాయత్ సేవా సమితి సభ్యులు తెలిపారు. దాదాపు రూ.60 లక్షలతో నూతన శివాలయం, ముఖద్వారం నిర్మించారు. 10వ శనివారం గంగపూజ, గోపూజ, విగ్రహాల సంప్రోక్షణ, 11న గంగపూజ, ఆలయ ప్రవేశం, అగ్ని ప్రతిష్టాపన, 12న సోమవారం మహాగణపతి, శివలింగం, పార్వతి, సుబ్రహ్మణ్య, నందీశ్వర విగ్రహాలను ప్రతిష్టిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

బుద్దదేవ్ భట్టాచార్యకు నివాళి

సోమందేపల్లి: పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్దదేవ్ భట్టాచార్య మృతి తీరనిలోట అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తెలిపారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేష్, రామకృష్ణ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

గోరంట్ల: మండల కేంద్రంలో ఉన్న ఆంజనేయస్వామి కాలనీలో రూ.10 లక్షల పంచాయతీ, మండల సాధారణ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం బీసీ సంక్షేమశాఖా మంత్రి సవిత భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, సర్పంచ్ సరోజబాయి, పంచాయతీ కార్యదర్శి బాబురావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ , ఆర్‌డీటీ ఏటీఎల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే







ప్రత్యేక అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి , తుమ్మల మారెమ్మ , యల్లమ్మదేవి



పావగడ: శీతలాంబాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

రొళ్ల : శ్రావణ మాసం తొలి శుక్ర వారాన్ని పురస్కరించుకొని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

గుడిబండ: పట్టణ సమీపంలో వెలసిన తుమ్మల మారెమ్మ ఆలయంలో తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరించి మహామంగళహారతి ఇచ్చారు.

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో తొలి శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శీతలాంబాదేవికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చన చేశారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు.

యల్లమ్మదేవి ఆలయ వార్షికోత్సవం

హిందూపురం టౌన్: పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో వెలసిన యల్లమ్మదేవి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయమే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హోమాలు చేశారు. సాయంత్రం యల్లమ్మ కుసుమా మహిళా మండలిచే భజన, పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

విద్యా సామగ్రి పంపిణీ

చిలమత్తూరు: మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఈడిగ అశోక్‌కుమార్ శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లోని 80 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.